క్లుప్తంగా

కోకో పంట ఉత్పత్తులకు జిల్లాలో ప్రాసెసింగ్ యూనిట్

అమలాపురం రూరల్: జిల్లా వ్యాప్తంగా 2,400 ఎకరాల్లో సాగవుతున్న కోకో పంట ఉత్పత్తులకు ఒకచోట ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు కలెక్టర్ ఆర్. మహేష్‌కుమార్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి కోకో కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ప్రాసెసింగ్ యూనిట్ల నిర్వహణ తీరుపై సరైన అవగాహన లేక గిట్టుబాటు ధరలు పొందలేకపోతున్నారని ఈ నేపథ్యంలో జిల్లా అంతటికీ ఒకే చోట ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పితే ప్రయోజనం ఉంటుందన్నారు. దీనిపై ఉద్యాన విశ్వవిద్యాలయం సాంకేతిక సహకారం కోరాలని ఆదేశించారు. జిల్లా ఉద్యాన అధి కారి బీవీ రమణ, అద్దాల గోపాలకృష్ణ, రమ్య ఫుడ్స్ ప్రతినిధులు సుబ్బారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి అభ్యుదయ రైతు గుత్తుల సూర్య ప్రకాష్ ఉద్యాన అధికారి దిలీప్ పాల్గొన్నారు

విలేజ్ సర్వేయర్లకు శిక్షణ

జిల్లాలోని 32 మంది విలేజ్ సర్వేయర్లకు డ్రోన్ ఆపరేషన్‌లపై శిక్షణ ఇవ్వడం జరిగిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. అమలాపురం కలెక్టరేట్‌లో డ్రోన్లను ఎగరవేయడంలో శిక్షణ పూర్తి చేసుకున్న 32 మంది విలేజ్ సర్వేయర్లకు ఆయన శిక్షణ పూర్తి సర్టిఫికెట్లు, లైసెన్సులను అందజేశారు. కార్యక్రమంలో డ్రోన్ శిక్షకుడు లీర్తి, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాదృక్పథాన్ని అలవర్చుకోవాలి

యానాం: విద్యార్థులు విద్యార్జనతో పాటు సామాజిక సేవాదృక్పథాన్ని అలవర్చుకోవాలని ప్రిన్సిపాల్ వేలాయుధమ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో స్థానిక నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐకి చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ప్రత్యేక ఎన్ఎస్ఎస్ సేవాశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ రీజినల్ కోఆర్డినేటర్ చింతపల్లి కృష్ణసుధాకర్, ప్రోగ్రామ్ ఆఫీసర్ వాసంశెట్టి ఆనంద్, లంక ప్రసాదరావు పాల్గొన్నారు.

సర్వేశ్వరశర్మకు అభినందన

అమలాపురం టౌన్: పట్టణానికి చెందిన కోనసీమ సైన్స్ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ సీవీ సర్వేశ్వరశర్మ సైన్స్ పాపులరైజేషన్ పురస్కారానికి ఎంపికైన సందర్భంగా ఆయనను ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు శనివారం అభినందించారు. పట్టణంలోని సర్వేశ్వరశర్మ ఇంటికి ఎమ్మెల్సీ వెళ్లి ఆయనను అభినందించి సత్కరించారు. వచ్చే ఆగస్టులో అమలాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 150 ఏళ్ల ఉత్సవాలు సర్వేశ్వరశర్మ పర్యవేక్షణలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు తెలిపారు.

నేటి నుంచి కొండాలమ్మ జాతర

ముమ్మిడివరం: స్థానిక కొండాలమ్మ చింత వద్ద గల అమ్మవారి జాతర ఉగాది పర్వదినం ఆదివారం నుంచి ప్రారంభమై వచ్చే నెల 8వ తేదీ వరకు కొనసాగుతాయని కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. వచ్చే నెల 8న అమ్మవారి గరగ పూజ, జాతర ఘనంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ పెట్టా శివప్రసాద్ తెలిపారు.

గంగాధర్ ప్రతాప్ సేవలు చిరస్మరణీయం

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతిగా విశేష సేవలు అందించిన గొల్లపల్లి గంగాధర్‌ప్రతాప్ సేవలు చిరస్మరణీయమైనవని పలువురు పేర్కొన్నారు. శనివారం గొల్లపల్లి గంగాధర్ ప్రతాప్ 60వ జయంతిని పురస్కరించుకుని గొల్లపల్లి అభిమానుల ఆధ్వర్యంలో స్థానిక చిన్నాసెంటర్‌లో గంగాధర్ ప్రతాప్ చిత్రపటానికి పలువురు పూల మాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండపాక సత్తిబాబు, ఉంగరాల బూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సారా తయారీ, విక్రయంపై కఠిన చర్యలు

అమలాపురం రూరల్: నాటుసారా తయారీ, విక్రయంపై కఠిన చర్యలు తీసుకుంటామని కోనసీమ జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎ.అమర్ బాబు అన్నారు. సారా రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం నవోదయ-2లో భాగంగా శనివారం రూరల్ మండలం కామనగరువులో నాటు సారా వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కామనగరువు గ్రామ కార్యదర్శి, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, పోలీస్, ఫారెస్ట్, విద్యాశాఖ సిబ్బంది, సర్పంచ్ నక్కా అరుణకుమారి, కార్యదర్శి రుద్రరాజు సూరపరాజు, సీఐసత్యనారాయణ, ఎస్సై బాలాజీ పాల్గొన్నారు.

సేవలు యథాతథం

అమలాపురం టౌన్: ఈనెల 30, 31 తేదీలు సెలువు దినాలైనప్పటికీ జిల్లాలోని రిజిస్ట్రార్ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాలు యథిధిగా పనిచేసి అటు రిజిస్ట్రేషన్లు, ఇటు మున్సిపల్ పన్నుల వసూళ్లను ఆయా కార్యాలయాలు నిర్వహిస్తాయి. ఈ రెండు రోజులు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ రిజిస్ట్రేషన్లు చేస్తారని అమలాపురం రిజిస్ట్రార్ శ్రీలక్ష్మి పేర్కొన్నారు. అమలాపురం మున్సిపల్ కార్యాలయంలో పన్నుల బకాయిదారులు రాయితీని సద్వినియోగం చేసుకుంటూ పన్నుల చెల్లించవచ్చని కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ పన్నుల చెల్లించవచ్చని సూచించారు. 31వ తేదీ వరకూ తమ సిబ్బంది పన్నుల వసూళ్ల కోసం విధుల నిర్వహిస్తారని మున్సిపల్ రెవెన్యూ అధికారి శ్రీలక్ష్మి తెలిపారు.

సచివాలయ వ్యవస్థ నిర్వీర్యం

- పౌర సేవలకు కూటమి ప్రభుత్వం కోత
- అలంకారప్రాయంగా సచివాలయాలు
- నేటికీ నెరవేరని సూపర్ సిక్స్ హామీలు

ముమ్మిడివరం: మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం స్థాపనే లక్ష్యంగా మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పల్లెల అభివృద్ధికి పెద్దపీట వేశారు. ప్రజల వద్దకే ప్రభుత్వ పాలన ధ్యేయంగా గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసి దేశ చరిత్రలో సరికొత్త విప్లవాన్ని తీసుకు వచ్చారు. మండల కేంద్రాలకు వెళ్లకుండా గ్రామంలోని సచివాలయాల్లో అన్ని పౌర సేవలు అందేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. కల్లబొల్లి హామీలతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయ వ్యవస్థను పక్కన పెట్టి ప్రజల సేవలకు కోత పెట్టింది.

తెరుచుకోని వెబ్‌సైట్లు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలల వుతున్నా సూపర్ సిక్స్ హామీల్లో ఒక్క పథకం కూడా అందక, సచివాలయాల్లో సేవలు అందుబాటులోకి రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురువుతున్నారు. ప్రజలకు అవసరమైన రేషన్‌కార్డులు, కొత్త పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డులు, అన్నదాత సుఖీభవ, వంటి వెబ్‌సైట్లు ఇప్పటికీ తెరుచుకున్న దాఖలాల్లేవు. ప్రజలు ప్రస్తుతం కుల, ఆదాయ, ధ్రువపత్రాలు వన్‌బీ వంటి సాధారణ సేవలు మాత్రమే పొందు తున్నారు. దీంతో ప్రజలు కూటమి ప్రభుత్వం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సచివాలయ సేవలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ప్రజలు పెద్ద ఎత్తున విమర్శిస్తున్నారు.

వైఎస్సార్ సీపీ పాలనలో ఇంటి వద్దకే పౌర సేవలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పల్లెల్లోనే సేవలు అందించేందుకు ప్రతి గ్రామంలో సచివాలయాన్ని ఏర్పాటు చేసి వాటికి అనుసంధానంగా 50 గృహాలకు ఒక వలంటీర్‌ను నియమించారు. వాటి ద్వారా అన్ని సేవలు ప్రజలకు నేరుగా అందజేశారు. ఒక్కో సచివాలయ భవనాన్ని రూ.45 లక్షలు వెచ్చించి నిర్మించారు. ప్రజలు తమకు వీలున్నప్పుడే సమస్యలు విన్నవించుకునేందుకు సచివాలయాలు ఎంతో ఉపయోగపడేవి. సంక్షేమ పథకాలతో పాటు విద్య, వైద్యం, వ్యవసాయం, రెవెన్యూ, పోలీస్, విద్యుత్, తదితర సేవలు వివిధ ధ్రువపత్రాలు, ఆస్తుల రిజిస్ట్రేషన్లు, ఆధార్ సేవలు పల్లెల్లోనే పొందేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఈ సేవలు కనిపించడం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయాలు వెలవెలబోయాయి. ఇప్పటికే వలంటీర్ వ్యవస్థను పక్కన పెట్టిన కూటమి ప్రభుత్వం వలంటీర్లను విధుల నుంచి తొలగించింది. సచివాలయ ఉద్యోగుల సంఖ్యను తగ్గిస్తోంది.



పటవల గ్రామ సచివాలయం



గాడిలంకలో నిరుపయోగంగా బల్క్‌మిల్క్ సెంటర్

ఎక్కడ దరఖాస్తు చేసుకోవాలి?

రేషన్‌కార్డుల వెబ్‌సైట్ తెరిస్తే దరఖాస్తు చేసేకునేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారు. గతంలో సచివాలయాలకు వెళితే సిబ్బంది నుంచి సమాధానం లభించేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. గతంలో ఇంటికే వచ్చిన వలంటీర్‌ను ఏదైనా సమస్య అడిగితే ఉన్నతాధికారులను అడిగి సమాధానం చెప్పేవారు. ప్రస్తుతం పింఛన్, రేషన్, కార్డుల కోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలో తెలియక ప్రజలు అల్లాడుతున్నారు.

సేవలను కొనసాగించాలి



గత ప్రభుత్వంలో గ్రామాల్లో ఏర్పాటైన సచివాలయాలతో ప్రజలకు విస్తృతమైన సేవలు అందేవి. గతంలో వలంటీర్లు ఇంటింటికీ వచ్చి సంక్షేమ పథకాలకు సంబంధించిన దరఖాస్తులు, అవసరమైన పత్రాల మంజూరు వంటి సేవలు అందించేవారు.గతంలో మాదిరిగానే ఇప్పుడు కూడా ప్రభుత్వ పౌర సేవలను సచివాలయాల ద్వారా అందించాలి.

– కూరాటి వాసు, గోవలంక, తాళ్లరేవు మండలం

సంక్షేమ పథకాలు అందించాలి



గ్రామ సచివాలయ సేవలు కొనసాగించాలి. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 10 నెలలైనా ప్రజలకు ఎలాంటి పథకాలు అందడం లేదు. రేషన్‌కార్డులతో పాటు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు వెబ్‌సైట్ సేవలు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి

– చింతా నాగమునీంద్రరావు, కత్రివానిరేవు

వైవీ సుబ్బారెడ్డికి కోనసీమ నేతల పరామర్శ



సుబ్బారెడ్డిని పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అమలాపురం టౌన్: మాతృ వియోగంతో బాధపడుతున్న రాజ్యసభ సభ్యుడు, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం పరామర్శించారు. ఒంగోలులోని సుబ్బారెడ్డి ఇంటికి పార్టీ నాయకులు వెళ్లి ఆయనను పరామర్శించి, తమ సానుభూతి తెలిపారు. జిల్లాకు చెందిన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పి.గన్నవరం నియోజకవర్గ పార్టీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ నాయకులు చెల్లుబోయిన నాని, కేతా భాను తేజ, ముషిణి రాఘవేంద్ర, పాటి రవి తదితరులు సుబ్బారెడ్డిని, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సుబ్బారెడ్డి తల్లి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

వైభవంగా పరదేశమ్మ తీర్థం

తాళ్లరేవు: ఇంజరం గ్రామదేవత పరదేశమ్మవారి తీర్థం శనివారం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి జాతర, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన ఆడపడచులు అమ్మవారికి మొక్కులు సమర్పించారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, వైఎస్సార్ సీపీ నాయకులు పితాని బాలకృష్ణ, సర్పంచ్ ముద్దన వెంకటశివరామ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు కోరుకొండ కిరణ్‌కుమారి, నాయకులు పాల్గొని పూజలు చేసారు.

ఆలయాల వద్ద ఉగాది ఉత్సవాల సందడి



ఉగాది ఉత్సవాలకు అలంకృతమైన అమలాపురం పట్టణ దేవత సుబ్బాలమ్మ దేవస్థానం



భీమనపల్లి పాఠశాలలో ముందస్తు ఉగాది సంబరాల్లో పాల్గొన్న చిన్నారులు



కామాక్షీ పీఠంలో ఆంజనేయస్వామికి పూజ చేస్తున్న పండితులు

- పట్టణ దేవత సుబ్బాలమ్మ దేవస్థానంలో ఏర్పాట్లు
- నేడు భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ, తీర్థం

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణ దేవత సుబ్బాలమ్మ దేవస్థానంలో ఉగాది ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలు ఈనెల 28 నుంచి ప్రారంభమై ఏప్రిల్ 8వ తేదీ వరకూ కొనసాగనున్నాయి. ఇప్పటికే అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి నూలు వారి కుటుంబీకులతో అమ్మవారి చిన్న జాగరం (జాతర) వైభవంగా నిర్వహించారు. శనివారం అమ్మవారి పెద్ద జాగరం (జాతర) కన్నుల పండువగా సాగింది. గ్రామోత్సవం పేరుతో గరగ నృత్యాలతో అమ్మవారిని పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. సుబ్బాలమ్మ సమక్షంలో దేవస్థానం వద్ద శ్రీవిశ్వావసు నామ సంవత్సర చైత్ర శుద్ధ పాడ్యమి రోజున ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకూ ఉగాది తీర్థం నిర్వహించనున్నారు. ఉదయం నుంచి దేవస్థానం వద్ద భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీకి, దేవస్థానం ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ దాతల సహకారంతో భక్తులకు ప్రసాద వితరణ జరుగుతుంది. చలివేంద్రం ద్వారా మజ్జిగ పంపిణీకి ఏర్పాట్లు చేశారు. ఈనెల 31 నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకూ దేవస్థానంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. 7వ తేదీ ఉదయం నుంచి దేవస్థానంలో 24 గంటల పాటు ఏకాహం భజన కార్యక్రమం జరగనుంది. 8న ఉదయం 11 గంటల నుంచి దేవస్థానం వద్ద భారీ అన్న సమారాధనకు ఏర్పాట్లు చేశారు. ఉగాది ఉత్సవాలకు దేవస్థానాన్ని సర్వాంగ సుందరంగా విద్యుత్ దీపాలు, పూల దండలు, మామిడి తోరణాలతో అలంకరించారు. దేవస్థానాన్ని రంగులతో ముస్తాబు చేశారు. దేవస్థానం ఈవో ఆర్.శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ పెద్దిరెడ్డి సాయి పుల్లయ్యనాయుడు, కమిటీ సభ్యులు ఈ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.



సుబ్బాలమ్మవారు

ఘనంగా ముందస్తు ఉగాది వేడుకలు

ఉప్పలగుప్తం: భీమనపల్లి శిరంగు రంగనాయకమ్మ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ముందస్తు ఉగాది వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థిని, విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో అలంకరించారు. విద్యార్థులతో ఏర్పాటు చేసిన కవి సమ్మేళనం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ గుర్లింక సూర్యనారాయణ మూర్తి, ప్రధానోపాధ్యాయుడు నూకల సత్యనారాయణ, ఆర్.వెంకటేశ్వరరావు, కామన మధుసూధనరావు, అరవ స్వామినాయుడు పాల్గొన్నారు.

నేడు మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో..

ఐ.పోలవరం: నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఉగాది సందర్భంగా పంచాంగ పఠనం కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సహాయ కమిషనర్ కార్యనిర్వాహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ శనివారం తెలిపారు. ఆలయ అర్చకులు, పురోహితులు పంచాగాలకు ప్రత్యేక పూజలు, అనంతరం యానాంకు చెందిన బ్రహ్మశ్రీ నాగాభట్ల సుబ్రహ్మణ్యశర్మతో నూతన తెలుగు సంవత్సరాది శ్రీ విశ్వావసు నామ సంవత్సర రాశి ఫలాలు, కందాయ ఫలాలు, పాడి, పంటల పరిస్థితులను భక్తులకు వివరిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం ఉగాది పచ్చడి పంపిణీ, సాయంత్రం భక్తులకు ప్రసాదం వితరణ ఉంటుందన్నారు.

కామాక్షీ పీఠంలో ప్రత్యేక పూజ

అమలాపురం టౌన్: ఉగాది ఉత్సవాల్లో భాగంగా స్థానిక శ్రీ కామాక్షీ పీఠం మహా సంస్థానంలో తొలిరోజు శనివారం ఆంజనేయ స్వామికి లక్ష తమలపాకుల పూజ శాస్త్రోక్తంగా నిర్వహించార. కామాక్షీ పీఠాధిపతి కామేశ మహర్షి పర్యవేక్షణలో పీఠం ఉత్తరాధికారి, బాల బ్రహ్మచారి విఘనస రాఖీ ప్రేమ్ బృందం, పీఠం బ్రహ్మ గోవిందవర్జుల నాగబాబు ఈ పూజను వైభవంగా నిర్వహించారు. తొలుత ఆంజనేయస్వామికి పలు రకాల పండ్ల రసాలతో పంచామృతాభిషేకం చేశారు. ఈనెల 31న పీఠంలో కామాక్షీ దేవికి లక్ష చామంతి పూజ నిర్వహిస్తామని పీఠాధిపతి కామేశ మహర్షి వెల్లడించారు.

వెంకన్న కల్యాణోత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

అమలాపురం టౌన్: ఏప్రిల్ 4 నుంచి ప్రారంభం కానున్న అమలాపురం వేంకటేశ్వస్వామి దివ్య కల్యాణోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను, కరపత్రాలను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు దేవస్థానంలో శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, దేవస్థానం ఉత్సవ కమిటీ చైర్మన్ జంగా అబ్బాయి వెంకన్న, జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు మెట్ల రమణబాబు, ఉత్సవ కమిటీ సభ్యుడు మోకా వెంకట సుబ్బారావు, దేవస్థానం అర్చకుడు పెద్దింటి లక్ష్మీనరసింహాచార్యులు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పెచ్చెట్టి విజయలక్ష్మి, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు పాల్గొన్నారు. దేవస్థానం ఈవో యర్రా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. దేవస్థానం ఉత్సవ కమిటీలో సభ్యులుగా ఉన్న జనసేన నాయకులకు ఈ కార్యక్రమానికి ఆహ్వానం లేకపోవడంపై ఆ పార్టీ పట్టణ కేడర్‌లో చర్చనీయాంశమైంది.



వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల గోడ పత్రికలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు, కమిటీ ప్రతినిధులు

నిబద్ధతతో విధులు నిర్వహిస్తే గుర్తింపు

ముమ్మిడివరం: ప్రతి ఉద్యోగి తన విధులను నిబద్ధతతో నిర్వహిస్తే ప్రజల హృదయాల్లో కలకాలం నిలిచిపోతాయని, తగిన గుర్తింపు లభిస్తుందని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీం భాషా పేర్కొన్నారు. ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాల సమావేశపుహాలులో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన కదం ఉమామహేశ్వరికి వీడ్కోలు సభ శనివారం నిర్వహించారు. డీఈఓతోపాటు కార్యాలయ ఉద్యోగులు ఉమామహేశ్వరిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్యాలయ ఏడీ నక్కా సురేష్, సమగ్రశిక్ష ఏపీవో డాక్టర్ ఎంఏకే బీమారావు, ఏపీవో పి.రాంబాబు, సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్ ఎంవీవీ సత్యనారాయణ, సమగ్ర శిక్ష కార్యాలయ సూపరిండెంట్ వరప్రసాద్, జిల్లా సైన్సు అధికారి గిరిజాల వెంకటసత్య సుబ్రహ్మణ్యం, తిరువూరు ఆర్డీవో మాధురి, జిల్లా ట్రెజరీ అధికారి డి.రామనాథం, సమగ్ర శిక్ష ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సుబ్బరాజు పాల్గొన్నారు.



ఉమామహేశ్వరిని సత్కరిస్తున్న డీఈఓ సలీం బాషా

ఉగాది పురస్కారానికి పైడిపాల, కొల్లూరి ఎంపిక

అమలాపురం టౌన్: అమలాపురానికి చెందిన కవి, పాటల పరిశోధకుడు డాక్టర్ పైడిపాల, కవి, వక్త, వ్యాఖ్యాత, తెలుగు విభాగాధిపతి డాక్టర్ ఎస్ఆర్ఎస్ కొల్లూరి రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారానికి ఎంపికయ్యారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళా క్షేత్రంలో వారు ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ఉగాది పర్వదినాన ఈ పురస్కారాన్ని ఆదివారం అందుకోనున్నారు. విశ్రాంత తెలుగు అధ్యాపకుడైన డాక్టర్ పైడిపాల 40 ఏళ్లుగా ఎన్నో కవితలు, కథలు, మరెన్నో సాహితీ పరిశోధనలు చేశారు. ప్రపంచ తెలుగు మహాసభల్లో అనేక పర్యాయాలు డాక్టర్ కొల్లూరి ముఖ్య సంచాలకులుగా వ్యవహరించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక కవి సమ్మేళనాలను నిర్వహించారు. భారత్ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఆంధ్ర బుక్ ఆఫ్ రికార్డ్స్, తానా బుక్ ఆఫ్ రికార్డ్స్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఆయన స్థానం సాధించారు.



డాక్టర్ కొల్లూరి డాక్టర్ పైడిపాల

ప్రకృతి విపత్తులపై అవగాహన అవసరం

అమలాపురం రూరల్: వరదలు తుఫాన్లు సంభవించే ప్రాంతాల్లో ముందస్తు హెచ్చరికలు, ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు కార్యాచరణ ప్రణాళికలను ముందుగా సిద్ధం చేసుకోవాలని రాయవరం తాహసీల్దారు మాస్టర్ ట్రైనరు ఐపీ శెట్టి జిల్లాస్థాయి అధికారులకు సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో ఆయన జిల్లాస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి ఇటీవల విపత్తుల నిర్వహణ దళం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో తర్ఫీదు పొందిన మాస్టర్ ట్రైనర్స్ ద్వారా విపత్తుల నిర్వహణపై అవగాహన పెంపొందించారు. వాతావరణ శాఖ హెచ్చరికలను రేడియో, టీవీ, మొబైల్ ఫోన్ల ద్వారా సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. విపత్తు ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లేలా సహాయక చర్యలు చేపట్టాలన్నారు. ఈ శిక్షణలో మరో ట్రైనర్ పి కిరణ్ చైతన్య పి శ్రీనివాస్ అధికారులకు మరింతగా అవగాహనను పెంపొందించారు.

ధాన్యానికి కనీస మద్దతు ధర కల్పనకు సమన్వయంతో పనిచేయాలి

ధాన్యానికి కనీస మద్దతు ధరలు కల్పనకు సిబ్బంది సమన్వయంతో కృషి చేయాలని పౌరసరఫరాల జిల్లా మేనేజర్ బాల సరస్వతి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు సంబంధిత సిబ్బందికి సాంకేతిక శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు, తూనికలు కొలతలు కంట్రోలర్ రాజేష్ ,సహాయ మేనేజర్లు నాగేశ్వరరావు, భానుమతి టెక్నికల్ సహాయకులు, రైతు సహాయ కేంద్రాల విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, హెల్పర్లు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



సాంకేతిక శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న మేనేజర్ బాల సరస్వతి

జేపీబీసీ సత్తిబాబు సేవలు ప్రశంసనీయం

అమలాపురం రూరల్: వన్నెచింతలపూడి గ్రామ పంచాయితీ జేపీబీసీగా పనిచేసిన పి సత్తిబాబు సేవలు ప్రశంసనీయమని డీఎల్ పీఓ బొజ్జిరాజు కొనియాడారు. పదవీ విరమణ పొందిన జేపీబీసీ సత్తిబాబుకు పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం వీడ్కోలు అభినందన సభ నిర్వహించారు. ఎంపీడీవో ఉండ్రు బాబ్జీరాజు సభకు అధ్యక్షత వహించారు. డీఎల్ పీఓ బొజ్జిరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం పంచాయతీ ఉద్యోగులు సత్తిబాబుకు వాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు.

సీఐ, ఎస్సై పుదుచ్చేరి బదిలీ

యానాం: యానాం పోలీస్‌స్టేషన్‌లో సీఐ కె.షణ్ముగం, ఎస్సై మురుగానందమ్‌ను పుదుచ్చేరికి బదిలీ చేస్తూ శనివారం డీజీపీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. షణ్ముగంను ఎఫ్ఆర్ఓ పుదుచ్చేరికి, మురుగానందమ్‌ను ఆర్యన్ కుప్పం ఎస్సైగా బదిలీ చేశారు. యానాం కొత్త సీఐగా ఎస్ అడలరసన్‌ను నియమించగా ఎస్సైగా ఇ పునీతరాజును నియమించారు. పుదుచ్చేరి, మాహే, కారైకల్ రీజియన్లలో 22 మంది పోలీసు అధికారులు బదిలీ అయ్యారు.

వేద, స్మార్త పండితుడు గరిమెళ్లకు సత్కారం

అమలాపురం టౌన్: స్థానిక శ్రీవాగ్దేవి స్కూల్లో శనివారం నిర్వహించిన ఉగాది ఉత్సవాలకు 92 ఏళ్ల వేద ఘనపాఠి, స్మార్త పండితుడు గరిమెళ్ల విశ్వనాథం ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు వేదాశీర్వాదాలు అందజేశారు. స్కూలు డైరెక్టర్లు పరసా రాజా, పరసా భరత్, ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రేష్ఠి శ్రీరామచంద్రమూర్తి, హెచ్ఎం పిచ్చిక సుబ్రహ్మణ్యం విశ్వనాథాన్ని శాలువాతో సత్కరించి, గౌరవించారు.

శతాధిక కవి సమ్మేళనం బ్రోచర్ల ఆవిష్కరణ

శ్రీశ్రీ కళా వేదిక జిల్లా శాఖ, కోనసీమ రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఏప్రిల్ 13న అమలాపురంలో నిర్వహించనున్న ఉగాది జాతీయ శతాధిక కవి సమ్మేళనం బ్రోచర్లను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో శనివారం ఆవిష్కరించారు. శ్రీశ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, కోనసీమ రచయితల సంఘం అధ్యక్షుడు బీవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు. జాతీయస్థాయిలో ఉగాది ఉత్సవాలు, శతాధిక కవి సమ్మేళాన్ని నిర్వహిస్తున్న ఆ సంస్థల ప్రతినిధులను ఎమ్మెల్యే అభినందించారు.

వాడీవేడిగా ఆక్వా జోన్‌పై గ్రామసభ



ఆక్వా జోన్ గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ విజయలక్ష్మి

అల్లవరం: బోడసకుర్రు సచివాలయం వద్ద మత్స్యశాఖాధికారి అశ్విని ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఆక్వా జోన్ గ్రామసభ రసాభాసగా మారింది. బోడసకుర్రు రెవెన్యూ పరిధిలో రెండు పంటలు పండే వ్యవసాయ భూములు 55.65 ఎకరాలను ఆక్వా జోన్‌లోకి చేర్చడంపై గ్రామసభలో ఉపసర్పంచ్ అడపా వెంకటేశ్వరరావు, విశ్రాంత వీఆర్వో అవర చంటి మధ్య వాగ్వాదం తలెత్తింది. ఈ పంట నమోదులో ఖరీఫ్, దాళ్వా పంటకు ఈకేవైసీ చేసిన పంట పొలాలను ఆక్వా జోన్‌లోకి ఎలా చేర్చారని అవర చంటి ప్రశ్నించారు. సెంటు భూమి లేనప్పుడు నీవు ఎందుకు ప్రశ్నించావని ఉపసర్పంచ్ చంటిని అడగడంతో వారి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. రెండు పంటలకు ఈకేవైసీ నమోదు చేసిన 55.65 ఎకరాల భూమిని ఆక్వా జోన్ చేర్చడంపై అగ్రికల్చర్ సహాయకులు బాలకృష్ణ తప్పిదమని రైతులు అన్నారు. వరదల సమయంలో పంట పొలాలు మునిపోతున్నందున ఈ భూములను ఆక్వా జోన్‌లోకి మార్చాలని అధికారులు సిఫారసు చేశారు. దీన్ని స్థానిక రైతులు వ్యతిరేకించారు. దీంతో గతం నుంచి కొనసాగుతున్న 84 ఎకరాల రొయ్యల చెరువులనే ఆక్వా జోన్‌గా గ్రామసభ ద్వారా తీర్మానం చేశారు. కొత్తగా ప్రతిపాదించిన 55.65 ఎకరాల భూమిని వ్యవసాయ భూములుగానే ఉంచాలని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ముత్యాల బాబి, కార్యదర్శి దుర్గా శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

ఆక్వాజోన్‌పై సదస్సు

ఐ.పోలవరం: మండలంలోని తిల్లకుప్ప, కేశనకుర్రు, ఐ.పోలవరం, టి.కొత్తపల్లిలో సంబంధిత గ్రామ సర్పంచ్‌ల అధ్యక్షతన ఆక్వా జోన్ గ్రామ సభలను మత్స్యశాఖ అధికారి గోపాలకృష్ణ నిర్వహించారు. ఈ గ్రామ సభలకు మండల స్థాయి అధికారులు, డిప్యూటీ తహసీల్దారు, మత్స్యశాఖ అధికారి, గ్రామస్థాయి అధికారులు, గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ మత్స్యశాఖ సహాయకులు, గ్రామ సర్వే సహాయకులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, సంబంధిత గ్రామ, ఎంపీటీసీలులు, గ్రామ కార్యదర్శులు, వార్డు మెంబర్లు, ఆక్వా రైతులు, ప్రజలు పాల్గొన్నారు. ఈ గ్రామ సభల్లో నిబంధనల ప్రకారం అమలాపురం డివిజన్, ఐ.పోలవరం మండలంలోని తిల్లకుప్ప, కేశనకుర్రు, ఐ. పోలవరం, టి. కొత్తపల్లిలో గ్రామస్థాయి కమిటీ (వీఎల్‌టీ) ద్వారా ఆక్వా జోనేషన్ రీ సర్వే చేశారు. గతంలో ఆక్వా జోన్ గెజిట్‌లో నమోదు కాని చెరువుల సర్వే నంబర్లను, వ్యవసాయానికి అనుకులంగా లేని, ఆక్వా చెరువుల ఏర్పాటుకు అనుకూలంగా ఉన్న భూముల వివరాలను ఏడు రోజుల క్రితం గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించారు. ఈ వివరాలను ఆక్వా జోన్ పరిధిలోకి తీసుకొచ్చేందుకు గ్రామ సభల్లో ఆమోదించారు.